# దాంపత్యము

## గుంటూరి మహేశ్వరి

ఉప్పు లేనిది, పులుపు లేనిది, కారము లేనిది తీపి లేనిది చేదు లేనిది—సత్యము

ఉప్పు, పులుపు, కారము, తీపి, చేదులతో మేళవించినది—దాంపత్యము.

ఇదీ సత్యము.

*  *  *

'సుగుణా'

'ఏమండీ?'

'ఆకలి వేస్తున్నాది.'

బార్లీ గంజి తీసుకురానా?

'రెండు రోజులనుంచి పోస్తున్నావుగా గంజి నా మొహాన్ని' కోపం ధ్వనించింది.

'నేనేం చెయ్యనండి. జ్వరం తగ్గితేగా అన్నం తినడానికి'

విసుగు, దీనత్వం తొంగిచూశాయి.

అబ్బ! జ్వరం బాగా తీసిపోయింది.

'చూడండి కోతలు! ఒళ్ళు మరిగిపోతున్నాది' చిరునవ్వు తిరుక్కుంది.

'ఇంతకీ! అన్నం పెడతావా? లేదా?' నిలదీసి అడిగేడు.

ఇదేం మొండిపట్టండీ! ఇంతకు ముందు కందంలో అన్నం పెట్టి వాలుకు ఊళ్ళకి వినబడేలా అరిచినా వచ్చేవారు కారు. ఇప్పుడేమో...అన్నం, అన్నం అని ప్రాణం తీస్తున్నారు. ఏమైనా సరే అన్నం పెట్టను.'

'ఏం చెప్పినా సరే! నేను బార్లీ త్రాగను.' మొండితనం జవాబు.

"బంగారు కదూ! చెప్పినట్లు......"

"...వినను వినను..."

"ఇలాంటివారితో ఈ ఇల్లాళ్ళు ఎలా గడిపేస్తారో గాని..."

"మా అమ్మ నీలాగ లంకణాలు పడుకో బెట్టదు. చక్కగా..."

"ఆ అవును! గారెలు, బొబ్బట్లతో అన్నం పెట్టేవారేం? జ్వరము లేదు గిరమూ లేదు అంటున్నారే? మరి పక్కమీద నిరవంగా అలాగే పడుకున్నారే? టెంపరేచరు గాముని తిరగక..."

"రెండు రోజులు పచ్చి మంచినీళ్ళయినా యిస్తూ, టెంపరేచరుగాముని తిరగమంటావా? ఈపూట కొత్త అన్నం పెడితే పాయసం కాలము ఓ మైలు షికారు వెళ్ళి వస్తాను. తెలుసా."

"అలాగే! గొప్ప పనిచేస్తారు. పక్కింటి అవ్వగారు రానీండి. ఆవిడని అడిగి పెట మంటే, అన్నం పెడతాను. ఆవిడ చెప్పే మందులు కషాయాలు మంచిపని చేస్తాయి. ఏ డాక్టరుకీ ఆవిడ తీసిపోదు.

*  *  *

"అమ్మాయీ, ఎలా ఉందమ్మా అబ్బాయికి" అంటూ సుబ్బమ్మగారు వచ్చేరు.

"ఆ! రండి. జ్వరం అలాగే ఉంది. చంటి పిల్లాడిలాగ అన్నం తింటానని ఒకటే పేచీ చేస్తున్నారు, బార్లీ త్రాగరుట".

"అన్నీ అబద్ధాలండీ అవ్వగారూ! చూడండి జ్వరం ఎలా తగ్గిపోయిందో! జ్వరం తగ్గినా అన్నం పెట్టదుట."

అవ్వగారు ప్రకాశరావు నుదుటిమీద చెయ్యి వేసి చూసింది, "అబ్బే! జ్వరము లేదు ఏమీ లేదు. వెచ్చగా ఉండడం అందరికీ ఉంటుంది ఈ చలికాలంలో..."

"అయినా! జ్వరం పూర్తిగా తగ్గితే నే గాని ఎవరికీ అన్నహితవు కలుగదు. అన్నం తినాలనిఉంది కాబట్టి ఈపూటకి కొత్త అన్నం పెట్టు. ఫరవాలేదు."

ఏదో గొప్ప విజయం సాధించినట్లు ప్రకాశరావు సుగుణవంక చూసేడు, సుగుణ తల వంచింది.

*  *  *

"సుగుణా! అయిందా అన్నం!

"ఇదిగో అవుతున్నాది."

"కొత్త కారంగా పెసరపప్పు పచ్చడైనా చెయ్యి. హితవుగా ఉంటుంది."

"ఆ...చేస్తున్నానండీ మనసులు, కోరికలు. ఏదో తేలికగా నిమ్మకాయ, చారు వేసుకొని తినక."

*  *  *

ఏమండీ! అన్నం వడ్డించమంటారా?

"ఆ వస్తున్నా"

చెయ్యి ముట్టుకొని చూచి, "ఒళ్ళు ఇలా మరిగిపోతున్నది. జ్వరము లేదు. అన్నం పెట్టమంటారు. నాకు భయం బాబూ!" అంది సుగుణ.

"నీ మొహం! నా ఆకలి మంటకి ఒళ్ళు వేడెక్కింది అంతే"

"సరే మీ యిష్టం. అవ్వగారుకూడా ఫరవాలేదన్నారు. కందంలో అన్నం పెట్టేను. తినండి."

"అన్నం వేడిగా వుంది"

"అయితే చల్లార్చి చేతిలో ముద్దలు పెడతాను తినండి .. ఊ తినండి ... చెయ్యి చాచరే?"

"ఊహూ...నాకు వద్దు"

"ఏం. ఎందుకు అక్కర లేదు?"

"జ్వరం కాస్తున్నాది కనుక"

"ఇదేమిటండీ! చిన్నపిల్లలాగ చిలిపి ఆటలు. ఇంతసేపు ప్రాణాలు తీసి, ఇప్పుడేమో తిననంటున్నారు."

అవ్వగారు వచ్చేరు. సుగుణ ఆవిడతో 'చూడండి అన్నం పెడితే...'

"—వద్దంటున్నారు అంతేనా! నాకు తెలుసు నేను పొద్దున ఇక్కడకు వచ్చేను. నువ్వు తులసి చెట్టు దగ్గర వున్నావు. అబ్బాయికి జ్వరం వచ్చినదగ్గరనుండి నువ్వు అన్నం తినడం మానేశావుట. అన్నమే వండడం లేదు. బన్ రొట్టి అరటిపళ్ళతో గడిపేస్తున్నావుట. నీచేత వంట చేయించి తినిపించాలని నేను, అబ్బాయి ఈ నాటకం వేశాము. ఇంక నా అభినయం అయింది ఇంక మీ ఇద్దరి సంభాషణ బాకీ" అంటూ వెళ్ళిపోయింది నిండుగా నవ్వుకుంటూ.

ప్రకాశరావు సుగుణవేపు కొంటెగా చూశాడు, సుగుణ కళ్ళలో ఆశ్రుబిందువులు తళతళ లాడేయి.





ఆహ్లాదకరమైన చల్లదనమునకు

POMPEIA LOTION

ఇంటర్నేషనల్ ఫ్రాంచైజెస్ (ప్రై) లిమిటెడ్, కలినా, బొంబే 29